క్లుప్తంగా

రేపు పీవీపై పాట ఆవిష్కరణ

నయీంనగర్: ఈనెల 28న భారతరత్న, మాజీ ప్రధాని పీవీ.నర్సింహరావు జయంతి సందర్భంగా పీవీపై రాసిన పాట సీడీ ఆవిష్కరణ కార్యక్రమం 27న జరగనుందని ఆయుర్వేద వైద్యులు పాములపర్తి రామారావు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న కార్యక్రమాన్ని పీవీ అభిమానులు, సాహితీ ప్రియులు, కవులు, కళాకారులు, సంగీత ప్రియులు విజయవంతం చేయాలని కోరారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు



హన్మకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి, డీఈలు ఎ.ఆనందం, ఎస్.మల్లికార్జున్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం



హన్మకొండ అర్బన్: శ్రీభద్రకాళి వీరభద్ర సేవ సమితి ఆధ్వర్యంలో బుధవారం సందర్భంగా నగరంలోని బాలసముద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ మండవ నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాసమితి వ్యవస్థాపకుడు పిన్నా శివకుమార్ ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజు 100 కిలోల బియ్యంతో సుమారు 600 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకుడు, కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారి ఎస్.శ్రీధర్, రిటైర్డ్ హెచ్ఎం నారాయణ రెడ్డి, చొల్లేటి శ్రీధర్, గౌరిశెట్టి ధనుంజయ, ఉల్లెంగుల మహేష్, విష్ణువర్ధన్, రామ్మోహన్, పాములపర్తి కేశవ్ కుమార్, రాంరాజ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

మడికొండ: మడికొండ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరిష్కార మార్గం చూపారు. పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించగా, సమస్యలను పరిష్కరించాలని మడికొండ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సంధ్యారాణి, ఎంపీపీఎస్ హెచ్ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు కోరారు. వారు పేర్కొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జేసీబీ సహాయంతో బుధవారం కచ్చా కాలువ తీయించారు.

రూ.1.01 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కేసోజు రోహిత్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని, రూ.1.01 లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట పోలీసుల కథనం ప్రకారం కొంతకాలంగా రోహిత్.. గుట్కాలు అమ్ముతున్నట్లుగా అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి రవాణాకు సిద్ధంగా గుట్కాలను పట్టుకున్నారు. నిందితుడిపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగ తెగిపడి రెండు జీవాలు మృతి



మడికొండ: విద్యుత్ వైరు తెగిపడి రెండు మూగజీవాలు మృతి చెందిన సంఘటన మడికొండ శివారులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన తొర్రి రవి యాదవ్ బుధవారం ఉదయం మేత కోసం గొర్రెలను తోలుకొని మడికొండ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో మేత మేస్తున్న గొర్రె, మేకపై విద్యుత్ వైరు తెగిపడడంతో అవి మృతిచెందాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు రవి కోరారు.

'స్కూల్'ను ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలి

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలో కాకుండా ఇతర చోట ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు బుధవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేయూకు చెందిన భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలని పాలకమండలిలో నిర్ణయించడం సరికాదన్నారు. బీఆర్ఎస్వీ నాయకుడు డాక్టర్ కొమురయ్య, బాధ్యులు మాచర్ల శరత్‌చంద్ర, అరూరి రంజిత్, లంక రాజగోపాల్, రాకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సమస్యల్లో సర్కారు బడులు



వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన నల్లాలు



అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు

- వెంటాడుతున్న తాగునీటి కష్టాలు
- అసంపూర్తిగా కిచెన్ షెడ్, టాయిలెట్ గదులు
- బెంచీలు లేక నేలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

ధర్మసాగర్ : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సమస్యలు వెంటాడుతున్నాయి. మౌలిక వసతులు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం చేపట్టగా పాఠశాలల్లో కనీస వసతులు లేవని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేదిలేదని తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారు.

అసంపూర్తిగా కిచెన్ షెడ్, టాయిలెట్స్

మండలంలోని ముప్పారం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో గతంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో నూతన టాయిలెట్ గదులు, కిచెన్‌షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కానీ గుత్తేదారు ఆ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో చేసేదేమి లేక పాత మూత్రశాలలను మరమ్మతులు చేసి వినియోగించుకుంటున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. అయితే ఆ మూత్రశాలలో నీటి సరఫరా లేకపోవడంతో మగ్గులతో నీటిని తీసుకెళ్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కిచెన్ షెడ్ నిర్మించారని, కానీ తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తి చేయకపోవడంతో అసంపూర్తిగా ఉన్న గదులల్లోనే మధ్యాహ్న భోజనం తయారీ చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు. పాఠశాలలో నీటి సౌకర్యం కోసం నల్లాలు ఏర్పాటు చేశారని, వాటికి కనెక్షన్ కూడా ఇవ్వలేదన్నారు. దీంతో తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

అసాంఘిక పనులకు అడ్డగా..

ముప్పారం శివారులోని బీసీ కాలనీలో గల పాఠశాలకు ప్రహరీ, గేటు లేకపోవడంతో ఆ పాఠశాల ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. రాత్రి సమయంలో కొందరు ఆకతాయిలు పాఠశాలలో మద్యం తాగుతూ ఖాళీ సీసాలు ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు సీసాల పెంకులు గుచ్చుకునే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 35 మంది విద్యార్థులకు రెండు గదులు మాత్రమే ఉండగా అందులో ఒక గది అంగన్‌వాడీ సెంటర్‌కు కేటాయించారు.



బెంచీలు లేక నేలపై కూర్చున్న విద్యార్థులు

బెంచీలు లేక..

నారాయణగిరి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 65 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో నాలుగు తరగతి గదులు ఉండగా అందులో ఒకటి స్టాఫ్ రూంకు కేటాయించగా మిగతా మూడు గదుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ నెట్టుకొస్తున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చోవాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. దానికి తోడు విద్యార్థుల ఇళ్లు దూరంగా ఉండడంతో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ బ్యాగులు పాఠశాలలో పెట్టి అవసరమున్న పుస్తకాలు మాత్రమే ఇంటికి తీసుకెళ్తున్నారు. అయితే మరుసటి రోజు ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు బ్యాగులో నుంచి పుస్తకాలు తీస్తుంటే అందులో విషపురుగులు ఉంటున్నాయని భయాందోళన చెందుతున్నారు.

నర్సరీలను తరచూ పర్యవేక్షించాలి

- జెడ్పీ సీఈఓ విద్యాలత

శాయంపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హనుమకొండ జిల్లా జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో సోఫ్‌పిట్ లేని కారణంగా గడువు దాటిన మందులు, వ్యర్థాలు ఆస్పత్రి వెనకాల పడేయడంతో బుధవారం సాక్షి పత్రికలో 'పీహెచ్‌సీ సిబ్బంది నిర్వాకం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఆమె స్పందించి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఈజీఎస్ సిబ్బందితో ప్రాథమిక ఆర్యోగ కేంద్రం ఆవరణలో, పశు వైద్యశాల ఆవరణలో సోఫ్‌పిట్‌కు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. అనంతరం శాయంపేట, హుస్సేన్‌పల్లి గ్రామాల్లో గల నర్సరీలను, మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించి కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆమె సూచించారు.



పీహెచ్‌సీ ఆవరణలో సోఫ్‌పిట్ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

సాక్షి స్పందన

అనంతరం సోఫ్‌పిట్ పనుల పురోగతిపై ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలు ఎండిపోకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.

విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

- టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రఘుపతి

కమలాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం గాడి తప్పుతుందని, ఆ విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 27వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలిరావాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాల విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాలను మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలని, రాష్ట్రంలో విదేశీ, ప్రైవేట్ విశ్వ విద్యాలయాలను అనుమతించకూడదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తీసుకొచ్చిన జీఓ 25 నిబంధనలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న 30 వేల పాఠశాలలను అభివృద్ధి చేయాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలన్నారు. వివిధ డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, హెచ్ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు రాములు, లక్ష్మణ్, సునీత పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



ఆత్మకూరు : అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సతీష్‌బాబు



వేలేరు : మానవహారం చేపట్టిన విద్యార్థులు

ఆత్మకూరు : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏసీపీ సతీష్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ పులి రమేష్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని మోడల్ స్కూల్ సమీపంలో హనుమకొండ-ముల్కనూరు ప్రధాన రహదారిపై స్థానిక పోలీసులు విద్యార్థులతో కలిసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినట్లు తెలిసినా వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : విద్యార్థులతో కలిసి మానవహారం చేపట్టిన పోలీసులు

వేలేరు : మాదకద్రవ్యాలకు బానిసై యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై సురేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ మానవహారం చేపట్టారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి



వీల్‌చైర్ అందచేస్తున్న ఆర్గనైజర్

ధర్మసాగర్ : వికలాంగుల సంక్షేమమే మామిడి బత్తుల బాలకృష్ణ సొసైటీ ధ్యేయమని ఆర్గనైజర్ బాల్‌చందు విష్ణుదాస్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ కాలనీలో గల ఆయన స్వగృహంలో బుధవారం నిరుపేద కుటుంబ సభ్యుడైన రేణికుంట్ల జోగయ్యకు వీల్ చైర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి బత్తుల యుగేందర్ స్మారకార్థం ఆయన కుమారులు బాలకృష్ణ, వినోద్‌బాబు వికలాంగుల సహాయార్థం వారికి కావలసిన కనీస అవసరాలు తీర్చుతున్నట్లు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి రమేశ్ పాల్గొన్నారు.

మట్టి తరలించిన వాహనదారులపై కేసు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామ శివారులోని జాలకుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన వాహనదారులపై ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. మట్టి తవ్వి, అక్రమంగా రవాణా చేసిన డీబీఎల్ కంపెనీకి చెందిన రెండు హీటాచీలు, ఆరు టిప్పర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

'గాజర్ల'కు నివాళి

శాయంపేట : ఇటీవల జరిగిన కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్ట్ అగ్రనేత గాజర్ల రవి చిత్రపటానికి మండలంలోని గోవిందాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రజనీకాంత్, గ్రామ యూత్ అధ్యక్షుడు సురేష్ బుధవారం నివాళులర్పించారు. రవి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని సూచించారు. ఏబీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మితిమీరుతున్న మందుబాబుల ఆగడాలు

- ఎంపీడీఓ కార్యాలయమే అడ్డగా..

శాయంపేట : మండల కేంద్రంలో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో సిట్టింగ్‌లు చేస్తూ ఖాళీ మద్యం బాటిళ్లను అక్కడే పడేసి వేళ్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి గేటు లేకపోవడంతో మందుబాబులకు అడ్డగా మారింది. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మందుబాబులు మద్యం సేవించి బాటిళ్లను అక్కడే పడేసి వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయానికి గేటు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. అలాగే పోలీస్ అధికారులు మందుబాటుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఖాళీ మద్యం బాటిళ్లు

రోటరీ క్లబ్ సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

ఐనవోలు : క్యాన్సర్ రాకుండా నిరోధించే రూ.3వేల విలువచేసే వ్యాక్సిన్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్లేందుకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ సూచనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. సామాన్య విద్యార్థులు సుఖవంతమైన నిద్రపోవడానికి మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 160 మంది విద్యార్థినులు వినియోగించుకునేలా 80 బంక్ అండ్ బెడ్స్‌ను అందిస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని కొనియాడారు. బుధవారం కేజీబీవీ పాఠశాలలో టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావుతో కలిసి హాజరైన ఎమ్మెల్యే.. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, రోటరీ క్లబ్ వరంగల్ సంయుక్తంగా అందిస్తున్న బంక్ అండ్ బెడ్స్‌ను ప్రారంభించి విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో బిల్డింగ్ నిర్మాణాలు చేపడితే వారి పేర్లు శాశ్వతంగా ఉండేలా గెజిట్‌లో రావాలని కోరుకుంటున్నారని.. ఈ విషయాన్ని కేబినెట్‌లో చర్చించేలా మంత్రుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. విద్యార్థినులు ఎట్టిపరిస్థితిలో సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత సమాచారం నిక్షిప్తం చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ల వాడకం తగ్గించాలని, కుటుంబ విలువలు మంటగలిపే సీరియల్స్‌ను టీవీల్లో వీక్షించొద్దన్నారు. చదువుకుంటేనే బాగుపడతామని, దొంగ బాబాలను నమ్మి మోసపోకూడదని విద్యార్థినులకు సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఈఓ వాసంతి మాట్లాడుతూ.. కేజీబీవీల్లో మంచి ఉత్తీర్ణత సాధించడంతో పాటు పటిష్టమైన బాలిక సంరక్షణ పద్ధతులు పాటిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 1.2 లక్షల రోటరీ క్లబ్ ప్రతినిధులు ఉండగా ప్రతియేటా సుమారు పదివేల కొట్ల రూపాయలతో సమాజ హితానికి వినియోగంపబడే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జీఈసీఓ సునీత, ఎంఈఓ ఆనందం, కేజీబీవీ స్పెషలాఫీసర్ సునీత, రోటరీ క్లబ్ ప్రతినిధులు రాంప్రసాద్, బాలకోటిరెడ్డి, వీసీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బంక్ అండ్ బెడ్స్ అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు, ఎమ్మెల్యే నాగరాజు, టీజీ క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు, డీఈఓ వాసంతి

ఆలయంలో అమావాస్య చండీహోమం



హోమంలో పాల్గొన్న మంత్రి సతీమణి మంజుల

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం అమావాస్య చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భద్రకాళి అమ్మవారిని మేళతాళాల నడుమ యాగశాలకు తీసుకువచ్చి వేద మంత్రోచ్ఛరణలతో చండీహోమం నిర్వహించారు. హోమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సతీమణి మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, రమేశ్, సందీప్, వినయ్, శివకుమార్ భక్తులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎల్కతుర్తి : హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు స్వీకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని మోడల్ స్కూల్ ఆవరణలో యూత్ కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

విద్యార్థులకు స్టేషనరీ అందజేత



ఐనవోలు : స్టేషనరీ అందజేస్తున్న దాత అనిల్‌రెడ్డి

ఐనవోలు : మండలంలోని సింగారం ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ముక్కెర అనిల్‌రెడ్డి నోట్‌బుక్స్, పెన్సిల్, పెన్నులు, స్టేషనరీ అందజేశారు. జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ హెచ్ఎంలు మధుసూదన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఏఏపీసీ అధ్యక్షురాలు వెంకటమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో నోట్‌బుక్స్ పంపిణీ

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు దాత నీలం రాజు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. చెడు స్నేహానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, సత్యనారాయణ, ప్రేమ్‌చంద్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. ఖిలా వరంగల్ మండలం మార్కండేయ నగర్‌లో పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా అధ్యక్షతన బుధవారం సీపీఐ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సీపీఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. వేలాది మందిని సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐదేనని అన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నలుగురు బీఎస్సీ విద్యార్థులు బెంగుళూరులోని వైబ్రేట్ అకాడమీ నిర్వహించిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్వ్యూకు హాజరై ప్రతిభ కనబరిచారు. ఈమేరకు హృతిక్ రాజు, అశోక్, సాత్విక్, జయంత్ రూ.వేయి చొప్పున నగదు ప్రోత్సాహకం అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు జితేందర్, డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.